ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల జిల్లా వార్తలు

శనివారం 3 ఆగస్టు 2024



చిన్నవంగలిలో కూలిన మట్టి మిద్దె

కూలిన బతుకులు

- చాగలమర్రి మండలంలో ఘోర విషాదం
- మట్టిమిద్దె కూలి నలుగురు దుర్మరణం



చిన్నవంగలిలో మట్టి మిద్దె కూలి మృతి చెందిన దంపతులు, కూతుర్లు

విధి వారిని వెంటాడింది. మట్టి మిద్దె రూపంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగుర్ని మింగేసింది. గురువారం అర్ధరాత్రి ఈ విషాద ఘటన జరిగింది. ఉదయం నిద్రలేచి చూసిన గ్రామస్థులను ఈ ఘటన తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఒకేసారి తల్లిదండ్రులు, ఇద్దరు కూతుళ్ల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోవడం ప్రతి ఒక్కరి హృదయం చలించిపోయింది. అనాథగా మారిన గురుశేఖర్‌రెడ్డి రెండో కుమార్తె 'నాకు దిక్కెవరంటూ' రోదిస్తున్న తీరును చూసి ప్రతి ఒక్కరూ కన్నీరుగార్చారు.

చిన్నవంగలిలో మృతదేహాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ



వివరాలు 7లో..



శిథిల గంగ

- కూలుతున్న తెలుగు గంగ ప్రధాన కాల్వ సైడ్‌వాల్
- తుప్పుబడుతున్న బ్లాక్‌చానెల్ తూముల షట్టర్లు
- ఎత్తేందుకు వీలు లేకుండా మారిన వైనం
- ఆయకట్టు భూములకు నీరందటం ప్రశ్నార్థకమే

నంద్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి)/రుద్రవరం: శ్రీశైలం రిజర్వాయర్ నిండు కుండను తలపిస్తోంది. పోతిరెడ్డిపాడు ద్వారా నీరు జలాశయాలకు చేరుతోంది. ఇక కాలువల ద్వారా నీరు పంట చేలకు చేరడమే తరువాయి. అంతా బాగానే ఉన్నా.. తెలుగు గంగ ఆయకట్టు రైతుల పరిస్థితి అయోమయంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వం తెలుగు గంగ నిర్వహణను పూర్తిగా పట్టించుకోలేదు. దీంతో కాలువ శిథిలావస్థకు చేరింది. ప్రధాన కాలువ ఎక్కడికక్కడ పూడిపోయింది. లైనింగ్ కూడా దెబ్బతిన్నది. పంటలకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన తూముల షట్టర్లు ఎత్తే వీలు లేకుండా తుప్పు పట్టిపోయాయి. కాలువ ఇట్లా ఉంటే అధికారులు నీరు వదిలినా చివరి ఆయకట్టు దాకా చేరదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రధాన కాల్వ మొదలవుతుంది. ఇక్కడి నుంచి సుమారు 406 కి.మీ కొనసాగి చెన్నైకి తాగునీరు అందిస్తుంది. ఇక జిల్లాలో 96.14 కి.మీ పొడవున పారుతుంది. ఈ కాలువ పొడవునా 1, 1ఆర్, 15ఏ, 15బి కాల్వల కింద 39 బ్లాక్ ఛానెళ్లు (ఉప కాలువలు) ఉండగా, వీటి కింద 1,14,500 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వ తీరుతో ఆ ఆయకట్టుకు గడ్డు పరిస్థితి ఏర్పడింది. తెలుగు గంగ ప్రధాన కాల్వ అక్కడక్కడా బలహీనంగా మారింది. రుద్రవరం సమీపంలో తెలుగు గంగ ప్రధాన కాల్వకు నిర్మించిన సైడ్‌వాల్ కూలిపోయింది. అలాగే 21, 22 బ్లాక్ ఛానెళ్ల సమీపంలో కూడా సైడ్‌వాల్ కూలింది. కాలువ లోపలి భాగంలో అక్కడక్కడా సిమెంటు లైనింగ్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. కాలువలు దెబ్బతినటమే కాకుండా, అక్కడక్కడా ఇసుక, చెత్తతో కాలువలు ఎక్కువ శాతం పూడిపోయాయి. వీటిని తొలగించి నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఇవి దిబ్బలుగా మారిపోయాయి. దీంతో సాఫీగా సాగాల్సిన నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి ఆయకట్టు భూములకు నీరు చేరటం లేదు.



తుప్పుబట్టిన గంగ బ్లాక్ ఛానెళ్ల తూముల షట్టర్లు

● తుప్పుబట్టిన బ్లాక్ చానెళ్ల షట్టర్లు..

తెలుగు గంగ ప్రధాన కాల్వలో ఇలాంటి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంటే.. బ్లాక్ ఛానెళ్ల పరిస్థితి మరోలా ఉంది. ప్రధాన కాలువ నుంచి ఉప కాలువలకు నీరు మళ్లించే చోట తూముల షట్టర్లు చాలా వరకు తుప్పు పట్టిపోయాయి. వీటిని ఎప్పటికపుడు పరిశీలిస్తూ మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోలేదు. అధికారులు ఒకటి అరా బ్లాక్ ఛానెళ్లను పరిశీలించి మరమ్మతు చేస్తున్నారు. ఇక షట్టర్ల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. రెండేళ్ల కిందట 17, 19 బ్లాక్ ఛానెళ్లకు మరమ్మతులు చేశారు గానీ, ఈ ఛానెళ్ల షట్టర్లను మార్చలేదు. ఇక కాలువలో నీటి ప్రవాహాన్ని క్రమబద్ధీకరించడానికి, దిగువన ఎక్కడైనా కాలువ మరమ్మతు చేయాల్సి వచ్చినపుడు ఉపయోగించే ప్రధాన కాలువలోని గేట్ల పరిస్థితి కూడా సరిగా లేదు. 17వ బ్లాక్ చానెల్ వద్ద మెయిన్ కాలువలోని గేట్లు తుప్పు పట్టిపోయాయి. కనీసం ఈ గేట్లకు చాలా ఏళ్లుగా నల్ల రంగు వేసిన దాఖలాలు లేవు. వాస్తవానికి సాగునీటి కాలువల్లో ఉపయోగించే గేట్లు దశాబ్దాల పాటు మన్నుతాయి. కానీ తెలుగు గంగ కాలువలోని గేట్లు పాడైపోవటం చూస్తే కాలువల్లో అమర్చే ముందు వాటి నాణ్యతను పరిశీలించలేదనే అనుమానం వ్యక్తమవుతోంది.

షట్టర్లకు మరమ్మతులు చేయిస్తున్నాం

తెలుగు గంగ బ్లాక్ ఛానెళ్ల తూములను ఎప్పటికపుడు పరిశీలిస్తున్నాం. పాడైన షట్టర్లకు మరమ్మతులు చేయిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నాం. ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తాం. రైతులకు ఇబ్బంది రానివ్వం. - మోహనక్రిష్ణారెడ్డి, ఏఈ, తెలుగుగంగ.

గట్లు బలహీనం..



కూలిన ప్రధాన కాల్వ సైడ్‌వాల్

గంగ బ్లాక్‌ఛానళ్ల గట్లు చాలా బలహీనంగా మారాయి. ఎక్కడ పడితే అక్కడ కోతకు గురయ్యాయి. దీనివల్ల నీటి సరఫరా పూర్తి స్థాయిలో వదిలేందుకే లేదు. ఒకవేళ నీటి ప్రవాహం ఎక్కువై గట్లకు గండ్లు పడితే రైతులే పూడ్చుకోవలసిన పరిస్థితి. ఇప్పటికే గట్ల బలోపేతం కోసం గత వైసీపీ హయాంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు రైతులకు పలుమార్లు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇక కాల్వ గట్ల వెంట వెళ్లాలంటే రైతులు భయపడే పరిస్థితి ఉంది. కంప చెట్లు, ఇతర పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవటంతో విషపు కీటకాలు, పాములకు ఆలవాలంగా మారాయి. కాలువలను పరిశీలించేందుకు సంబంధిత సిబ్బంది, నీటిని పంటలకు మళ్లించుకునేందుకు రైతులు వెళ్లినపుడు విషపు కీటకాలు, పాముల బారిన పడే ప్రమాదముంది. జంగిల్ క్లియరెన్స్ చేస్తే వీటి భయం తగ్గుతుందని రైతులు అంటున్నారు. మొత్తానికి గత వైసీపీ ప్రభుత్వం తీరు వల్ల ప్రస్తుతం నీరు సమృద్ధిగా అందే అవకాశమున్నా.. తెలుగు గంగ ఆయకట్టు రైతులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు.

నీరు ఎన్ని ఎకరాలకు?

తెలుగుగంగ ప్రధాన కాల్వపై వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి నీటిని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి గంగ కాల్వకు నీటిని ప్రజాప్రతినిధులు, అధికారులు విడుదల చేసిన విషయం విదితమే. అయితే తెలుగు గంగ ప్రధాన కాలువ వెంట బ్లాక్ ఛానెళ్ల వద్ద సిమెంటుతో నిర్మించిన తూముల రంధ్రాలు, సైడ్ వాల్స్ దెబ్బతిన్నాయి. కల్వర్టుల వద్ద సిమెంటుతో నిర్మించిన దిమ్మెలు పగిలి శిథిలమై కాల్వల్లో పడిపోయాయి. బ్లాక్‌ఛానెళ్ల తూములకు చాలా చోట్ల తూముల షట్టర్లు సక్రమంగా లేవు. వాటిని అలాగే ఎత్తి ఉంచారు. వీటిని రిపేరు చేసేందుకు అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదన్న విమర్శలు రైతులు నుంచి వినిపిస్తున్నాయి. ఇలాగైతే గంగ నీరు సక్రమంగా పారుతుందా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాలువ కింద 1.14 లక్షల ఎకరాల్లో ఆయకట్టు ఉంటే.. ఎన్ని ఎకరాలకు నీరు అందిస్తున్నారు? అనేది అధికారులకే తెలియాలనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చివరి ఆయకట్టు భూములకు నీరు అందకపోవడటంతో పంటలు ఎండిపోయాయి. తమ పంటలు కాపాడాలంటూ రైతులు వైసీపీ ప్రజా ప్రతినిధులను ఆశ్రయించిన ఘటనలు గతంలో అనేకం ఉన్నాయి.



పోలీసుల సంక్షేమానికి పెద్దపీట : ఎస్పీ

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా →



నంద్యాల క్రైం, ఆగస్టు 2: జిల్లాలో పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తానని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా ప్రతి శుక్రవారం పోలీసుల సమస్యల పరిష్కారం కోసం పోలీస్ వెల్ఫేర్ డే (గ్రీవియన్స్)ను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. బదిలీలు, రిక్వెస్ట్, మెడికల్ సమస్యలు, సస్పెన్షన్ నుంచి విధుల్లోకి తీసుకోవడం తదితర సమస్యలను ఎస్పీకి సిబ్బంది స్వయంగా విన్నవించుకున్నారు. సిబ్బంది సమస్యలను తెలుసుకున్న ఎస్పీ తగిన పరిష్కారం చూపుతానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జేవీ సంతోష్, ఇన్‌స్పెక్టర్లు జయరాములు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన కల్పించండి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, ఆగస్టు 2: తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, ఇన్‌చార్జి డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ శారదాబాయిలతో కలిసి కలెక్టర్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ బిడ్డ పుట్టిన గంట లోపు ముర్రుపాలు తాగించా లన్నారు. బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎలాంటి అంటు వ్యాధులు సంభవించకుండా ఉంటాయని తెలి పారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, హెల్త్ సూప ర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తల్లిపాల ప్రాముఖ్యతను తల్లులకు తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రసన్నలక్ష్మి, వైద్యాధికార్లు శ్రీజ, తేజస్విని, శ్రీదేవి, డెమో రవీంద్రలు పాల్గొన్నారు.

శ్రీశైలంలో మద్యం సేవించిన సిబ్బందికి దేహశుద్ధి

శ్రీశైలం, ఆగస్టు 2: శ్రీశైలం మహాక్షేత్రంలోని దేవ స్థానంలో పనిచేసే సిబ్బంది ఒకరు మద్యం సేవించి విధులకు హాజరు కావడం తీవ్ర దుమారం రేపింది. దేవస్థానం క్యూ కాంప్లెక్స్‌లో విధులు నిర్వహించే ఏజెన్సీ సిబ్బంది ఒకరు మద్యం సేవించడంతో పాటు కాళ్లకు చెప్పులు ధరించి భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఘటన వెలుగుచూసింది. గురువారం రాత్రి తొమ్మిది గంటలకు స్వామివారి స్పర్శ దర్శనం కోసం క్యూకాం ప్లెక్స్‌లో వేచివున్న భక్తులకు మద్యం సేవించి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి భక్తులకు కంటపడ్డాడు. ఇదే సమయంలో క్యూలైన్లలో వేచివున్న భక్తులపై సదరు ఉద్యోగి దురుసుగా ప్రవర్తించడంతో ఆగ్ర హం చెందిన భక్తులు ఉద్యోగికి తగిన దేహశుద్ధి చేశారు. ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్రం, భువనగిరికి చెందిన భక్తుడు బింగి భరత్‌కుమార్ ఆలయ కార్యనిర్వహణాధికారికి డి. పెద్దిరాజుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై క్యూ కాంప్లెక్స్ నిర్వహణకు సంబంధించిన ఏఈవో, సూపరింటెండెంట్‌ను ఈవో పెద్దిరాజు సస్పెండ్ చేశారు. అలాగే సహాయ కార్యనిర్వణాధికారి, ముఖ్య భద్రతా అధికారి, పర్యవేక్షకుడికి చార్జిమెమో జారీ చేశారు.

పింఛన్ డబ్బుతో పరారైన ఉద్యోగి అరెస్టు

నంద్యాల కల్చరల్ / ప్యాపిలి, ఆగస్టు 2: పింఛన్ సొమ్ముతో పరారైన వెంగళంపల్లి సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్ పవన్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారని కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాపిలి మండలం వెంగళంపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పథకం కింద 50 మంది పింఛన్‌దారులకు పంపిణీ చేయాల్సిన రూ.2,23,500 తీసుకొని పరారైన సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్ పవన్‌కుమార్‌ను సస్పెండ్ చేశామని, ఆ తర్వాత పోలీసులు అరెస్టు చేశాని కలెక్టర్ తెలిపారు. ఈ డబ్బును అతని తల్లిదండ్రులను పిలిపించి వసూలు చేశామని తెలిపారు. వవన్‌కుమార్‌ను రిమాండ్‌కు పంపినట్లు ఆమె తెలిపారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న శివసేవకులు

శ్రీశైలం, ఆగస్టు 2: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఈ హుండీ లెక్కింపును ప్రధాన ఆలయంలోని చంద్రావతి కల్యాణమండపంలో నిర్వహించారు. భక్తులు గత 29 రోజులలో భక్తులు కానుకలను సమర్పించారు. హుండీ లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ.3,31,70,665 నగదు లభించింది. అదేవిధంగా 127 గ్రాముల బంగారు, 4.400 కిలోల వెండి లభించాయి. అదేవిధంగా 489 యుఎస్‌ఏ డాలర్లు, 4,445 యూఏఈ దిర్హమ్స్, 5 లక్షల వియత్నాం డాంగ్స్, 90 థాయిలాండ్ బట్స్, 108 ఖతార్ రియాల్స్, 20 ఇంగ్లాండ్ పౌండ్స్ మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, డిప్యూటీ ఈఓ రమణమ్మ, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డైవర్షన్ రోడ్

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

నందికొట్కూరు రూరల్ ఆగస్టు 2 : బ్రాహ్మణకొట్కూరు వద్ద ఉన్న హంద్రీ నీవా కాలువపై జాతీయ రహదారి కాంట్రాక్టర్ వేసిన డైవర్షన్ రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. హంద్రీ నీవా నీరు వెళ్లేందుకు హడావిడిగా పైపులను అమర్చి తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. గురువారం హంద్రీ నీవా అధికారులు సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం నుంచి 675 క్యూసెక్కుల నీటిని కాలువకు వదిలారు. నీరు ఎక్కువగా రావడంతో పైపుల ద్వారా వెళ్లలేక ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. రోడ్డుపైన వాహనాలు వెళ్తుంటే మట్టి రాలి పోతుండటంతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో డైవర్షన్ రోడ్ కొట్టుకుపోయిందనే ప్రచారం మొదలైంది. విషయం తెలుసుకున్న జాతీయ రహదారి అధికారులు యుద్ధ ప్రాతిపదికన భారీ యంత్రాలతో రోడ్‌ను పటిష్టపరిచారు. దీంతో ప్రమాదం తప్పినట్లయింది. అంతలోనే అక్కడికి జాతీయ రహదారి పీడీ గోవర్ధన్, కర్నూలు ఆర్‌డీఓ శేషిరెడ్డి, కర్నూలు తాలుకా తహసీల్దార్ రమేష్‌బాబు సిబ్బందితో వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళతామని వారు తెలిపారు

జాతీయ రహదారి పీడీ గోవర్ధన్‌ను ఆంధ్రజ్యోతి వివరాలు అడగగా.. డైవర్షన్ రోడ్ ప్రమాదకరంగానే ఉందని, పరిస్థితిని సమీక్షిస్తున్నామని తెలిపారు. కొద్దిగంటల్లోనే మెయిన్ బ్రిడ్జి మీదికి వాహనాలను మళ్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



హంద్రీనీవా కాలువపై నిర్మించిన డైవర్షన్ రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

శాశ్వత నిద్ర



మృతి చెందిన భార్య, భర్తలు గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మ



మృతి చెందిన అక్కా చెల్లెలు పవిత్ర, గురులక్ష్మి

- చిన్నవంగలిలో ఘోరం
- అర్ధరాత్రి కూలిన మట్టి మిద్దె
- నిద్రలోనే నలుగురి దుర్మరణం
- వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు..
- అనాథగా మారిన రెండో కుమార్తె
- నాకు దిక్కెవరంటూ కన్నీటి పర్యంతం



గురుశేఖర్‌రెడ్డి (ఫైల్) | దస్తగిరమ్మ (ఫైల్) | పవిత్ర (ఫైల్) | గురులక్ష్మి (ఫైల్)

చాగలమర్రి, ఆగస్టు 2: చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందారు. గ్రామానికి చెందిన తల్లపురెడ్డి గురుశేఖర్‌రెడ్డి (45), భార్య దస్తగిరమ్మ (38), పెద్దకూతురు పవిత్ర (16), చిన్న కూతురు గురులక్ష్మి (10)లు నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి మట్టి మిద్దె ఒక్కసారిగా కుప్పకూలింది. అర్ధరాత్రి కావడంతో ఎవరూ గమనించ లేదు. తెల్లవారు జామున గ్రామస్థులు గమనించి దిగ్భ్రాంతికి గురయ్యారు. మట్టి కుప్పలను నడుమ కూరుకపోయిన మృతదేహాలను వెలికి తీశారు. మట్టి మిద్దె కావడం, వర్షాలకు బాగా తడిచి దంతెలు దెబ్బతిని ఉండటంతో ఈ ఘోరం జరిగినట్లు తెలుస్తోంది. ప్రొద్దుటూరులోని ఉషోదయ పాఠశాలలో చదువుకుంటున్న గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మల రెండో కుమార్తె ప్రసన్న గ్రామానికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించి సొమ్మసిల్లి పడిపోయింది. బంధువులు ప్రసన్నను ఓదార్చారు. మృతదేహాల వద్ద బంధువులు, గ్రామస్థ రోదనలతో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు

ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ రమణయ్య, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కూలిన మట్టి మిద్దెను పరిశీలించారు. జరిగిన సంఘటన గురించి బంధువులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ రమణయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాకు దిక్కెవరు..



చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో మట్టిమిద్దె కూలి తల్లిదండ్రులు, అక్కా, చెల్లెళ్లు మృతి చెందడంతో 'నాకు దిక్కెవరంటూ' ప్రసన్న విలపించడానికి చూసిన ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. రాత్రి తనకు ఫోన్ చేసి ఉదయానికే విగతజీవులుగా మారిన కుటుంబ సభ్యులను చూసి సొమ్మసిల్లి పడిపోయింది. అస్వస్థతకు గురి కావడంతో ప్రసన్నను వైద్యశాలకు తరలించారు.

నలుగురి మృతి బాధాకరం

- ఆర్డీవో మల్లికార్జున రెడ్డి

మండలంలోని చిన్నవంగలి గ్రామంలో మట్టిమిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం దురదృష్టకరమని నంద్యాల ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిమిత్తం తీసుకెళ్లిన మృతదేహాలను పరిశీలించారు. వారి బంధువులతో మాట్లాడారు. జరిగిన సంఘటన గురించి విచారించారు. వర్షాకాలం మట్టిమిద్దెల్లో ఉండరాదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మృతుల కుటుంబానికి ప్రభుత్వపరంగా సాయం అందించి అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ్‌కుమార్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి



ప్రసన్న బాధ్యత నాది

- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



మండలంలోని చిన్నవంగలి గ్రామంలో మట్టి మిద్దె కూలి గ్రామానికి చెందిన గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మ, పవిత్ర, గురులక్ష్మి మృతి చెందడం బాధాకరమని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న ఆమె స్పందించి ఫోన్ ద్వారా మృతుల కుటుంబానికి సంతాపం ప్రకటించారు. ప్రసన్న చదువు బాధ్యత పూర్తిగా తాను తీసుకుంటానని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

వ్యవసాయంతో జీవనం..

గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మలు వ్యవసాయ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గరు కుమార్తెలు ఉన్నారు. మొదటి కూతురు పవిత్ర పదో తరగతి చదివింది. రెండో కూతురు ప్రసన్న ప్రొద్దుటూరు ఉషోదయ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. మూడో కూతురు గురులక్ష్మి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. గురుశేఖర్‌రెడ్డికి గ్రామంలో సొంత ఇల్లు ఉన్నా తల్లితో విభేదించి బయటకు వచ్చాడు. ఏడాది కాలం నుంచి బంధువుల మట్టి మిద్దెలో భార్యా పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు.



చిన్నవంగలిలో కూలిన మట్టిమిద్దె

మట్టి మిద్దెల గుర్తింపునకు సర్వే



చిన్నవంగలిలో మట్టిమిద్దెలను పరిశీలిస్తున్న డీపీవో, డీఎల్పీవో

జిల్లాలోని ఆయా గ్రామాల్లో మట్టి మిద్దెల గుర్తింపుకు సర్వే నిర్వహిస్తున్నట్లు డీపీవో మంజులవాణి తెలిపారు. ఒకే కుటుంబంలో నలుగురు మృతి విషయం తెలుసుకున్న ఆమె శుక్రవారం చిన్నవంగలి గ్రామాన్ని సందర్శించి కూలిన మట్టి మిద్దెను పరిశీలించారు. జరిగిన సంఘటన గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని మట్టివి ఎద్దెలను పరిశీలించారు. గ్రామంలో ఉన్న మట్టిమిద్దెలను సర్వే చేసి నివేదికలను తయారు చేయాలని గ్రామ కార్యదర్శులకు ఆదేశించారు. ఆమె వెంట డీఎల్పీవో రాంబాబు, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఎంఈవో అనూరాధ, కార్యదర్శులు నాగార్జున, వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అనిల్‌కుమార్ ఉన్నారు.

రూ.5 లక్షల పరిహారం అందిస్తాం

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



చాగలమర్రి: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో నలుగురు మృతి చెందిన విషయం పట్ల ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పందించారు. శుక్రవారం ఫోన్ ద్వార ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉండి ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల వరకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రసన్న ఉన్నత చదువుల కోసం పార్టీ తరపున ఆదుకుంటామని అన్నారు.



చిన్నవంగలిలో కూలిన మట్టిమిద్దెను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

ఉపాధ్యాయుల మధ్య ఘర్షణ

- హెచ్ఎంపై చెప్పుతో దాడికి యత్నించిన టీచర్
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- సంఘాల జోక్యంతో క్షమాపణ చెప్పిన ఉపాధ్యాయుడు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 2: ఆదోని పురపాలక పరిధిలోని ఓ ప్రధాన ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడికి, ప్రధానోపాధ్యాయుడికి మధ్య జరిగి ఘర్షణ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం ఉదయం పక్క పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు మరో ఉన్నత పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడిని సర్వీస్ రిజిస్టర్‌లో మరో ఉపాధ్యాయుడి వివరాలు సక్రమంగా రాయలేదని నిలదీశాడు. సర్వీస్ రిజిస్టర్‌లో తాను రాయలేదని, అలాంటిదేమైనా ఉంటే సవరిస్తానని ప్రధానోపాధ్యాయుడు సమాధానమిచ్చాడు. అయినా సదరు ఉపాధ్యాయుడు సర్వీస్ రిజిస్టర్‌లో ఎవరు రాశారో తెలుసుకుంటానని అనడంతో ఇద్దరి మధ్యా మాట మాట పెరిగింది. అసలు సర్వీస్ రిజిస్టర్‌ను మీరు ఎలా ఫోన్‌లో ఫొటో తీసుకుంటారు? మీకేం సంబంధమని హెచ్ఎం అన్నారు. ఈ క్రమంలో విచక్షణ కోల్పోయిన ఉపాధ్యాయుడు తన కాలికి ఉన్న చెప్పు తీసుకొని దాడి చేసే యత్నం చేశాడు. పక్కనే ఉన్న ఉపాధ్యాయులు అడ్డుకున్నారు. మా పాఠశాలకే వచ్చి మా హెచ్ఎంపై దాడి చేయడం ఏమిటని, అక్కడి నుంచి వెళ్లాలని సూచించారు. దీంతో తన పరువు పోయిందని హెచ్ఎం వెంటనే తోటి ఉపాధ్యాయులతో కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడాడు. ఉపాధ్యాయ సంఘాల ముఖ్య నాయకులు అక్కడికి చేరుకొని హెచ్ఎంపై దాడి చేయడంపట్ల మండిపడ్డారు. ఏదైనా సమస్య ఉంటే కూర్చొని మాట్లాడాలే తప్ప తనది కాని విషయానికి వచ్చి దాడి చేయడం మంచిది కాదని చెప్పారు. మరికొందరు జోక్యం చేసుకొని దాడికి యత్నించిన ఉపాధ్యాయుడి చేత హెచ్ఎంకు క్షమాపణ చెప్పించడంతో గొడవ సద్దుమణిగింది. విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాల్సిన ఉపాధ్యాయుడు పాఠశాల హెచ్ఎం మీద దాడికి దిగడం మంచిది కాదని పలువురు పేర్కొంటున్నారు. కాగా సదరు హెచ్ఎం న్యాయపరంగా వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

రాయలసీమ రేంజ్‌లో 52 మంది సీఐల బదిలీ

కర్నూలు, ఆగస్టు 2: రాయలసీమలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 52 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 20 మందిని వీఆర్‌కు పంపించారు. నంద్యాల డీటీసీలో పనిచేస్తున్న చంద్రబాబు నాయుడును కర్నూలు రూరల్ సీఐగా బదిలీ అయ్యారు. అదేవిధంగా కర్నూలు రూరల్ సీఐ కిరణ్ కుమార్ రెడ్డిని వీఆర్‌కు పంపారు. పాణ్యం సీఐ నల్లప్పను ఆదోని రూరల్‌కు బదిలీ చేయగా ఆదోని సీఐ నిరంజన్ రెడ్డిని వీఆర్‌కు పంపుతూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా

4న మినిస్టీరియర్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

కర్నూలు, ఆగస్టు 2: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియర్ ఉద్యోగుల సంఘం జిల్లా పరిషత్ యూనిట్ ఎన్నికలు 4న నిర్వహించనున్నట్లు యూనిట్ కార్యదర్శి రామచంద్రమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా పసుపల గ్రామ కార్యదర్శి కే. హేమంత్‌కుమార్‌రెడ్డి వ్యవహరిస్తారని అన్నారు. జిల్లా పరిషత్ ఆవరణలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఉదయం నామినేషన్లు, ఉపసంహరణ, జాబితా విడుదల, సాయంత్రం పోలింగ్, అనంతరం కౌంటింగ్ ఉంటుందన్నారు. యూనిట్ పరిధిలో మొత్తం 114 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆస్పరి, ఆగస్టు 2: మండలంలోని చిన్నహోతూరు గ్రామ సమీపంలో నంద్యాల జిల్లా నుంచి కర్ణాటక వెళ్తున్న బొలెరో వాహనం శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురైంది. టైరు పేలడంతో వాహనం బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న వెంకటేశ్వర రెడ్డి (65) అక్కడికక్కడే మృతి చెందగా అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు గాయపడ్డారు. నంద్యాల జిల్లా గోస్పాడు మండలం నెహ్రూ నగర్ నుంచి కర్ణాటకలోని కంప్లి సమీపంలో మారెమ్మ క్యాంపునకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి పార్టీల మధ్య

రగులుతున్న కుంపటి

- నెట్టేకల్లు ఫీల్డ్ అసిస్టెంట్ విషయంలో తలెత్తిన వివాదం



పంట పొలాల్లో ఘర్షణకు దిగిన టీడీపీ, బీజేపీ కార్యకర్తలు

ఆదోని రూరల్, ఆగస్టు 2 : ఆదోని కూటమి పార్టీల మధ్య తలెత్తిన కుంపటి ఆరేలా లేదు. గ్రామంలో ఏదో ఒక విషయంలో నాయకులు ఘర్షణలకు దిగుతున్నారు. గురువారం గణేకల్లు, హనవాళ్, ఇస్వీ పెద్దహరివాణం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వంట వండే విషయంలో కూటమి నాయకులు విడిపోయి కొట్టుకునే స్థాయికి వచ్చారు. ఇది మరవకముందే శుక్రవారం నెట్టేకల్లులో పండ్లమొక్కలు నాటే కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ కార్యకర్తలు విడిపోయి గొడవలకు దిగారు. సమయానికి పోలీసులు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కూటమి నాయకులు నెల క్రితం శాతాల వారిగా పదవులు పంచుకున్నారు. ఇందులో భాగంగానే టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు నెట్టేకల్లు ఫీల్డ్ అసిస్టెంట్‌గా టీడీపీ కార్యకర్త వీరారెడ్డి పేరును ప్రతిపాదించాడు. దీంతో నెల రోజులుగా వీరారెడ్డి ఉపాధి పనులను పర్యవేక్షిస్తూ వస్తున్నాడు. ఎమ్మెల్యే పార్థసారథి తనకు లెటర్ ఇచ్చాడని, తానే ఫీల్డ్ అసిస్టెంట్‌నని గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కన్నసింగ్ ఉపాధి అధికారులను కలిసి చెప్పాడు. ఇదిలా ఉండగా, గ్రామానికి చెందిన రైతులు గిడ్డయ్య, సుధీర్ సింగ్, నారాయణ సింగ్‌లకు 300 జామ, నిమ్మ తదితర పండ్ల మొక్కలను ఇవ్వడంతో శుక్రవారం వాటిని నాటడానికి ముందుగా వీరారెడ్డి అక్కడికి వెళ్లాడు. ఎమ్మెల్యే తనకు లెటర్ ఇచ్చాడని, తానే ఫీల్డ్ అసిస్టెంట్‌నని బీజేపీ కార్యకర్త కన్నసింగ్ గొడవ దిగడంతో వివాదం తారాస్థాయికి చేరింది. చివరకు ఏపీఓ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి ఇరువురిని అక్కడి నుంచి పంపించారు.

ఎయిమ్స్ తరహాలో కర్నూలు జీజీహెచ్‌ను అభివృద్ధి చేయండి

పార్లమెంటులో ఎంపీ నాగరాజు



కర్నూలు రూరల్, ఆగస్టు 2: కర్నూలు ప్రభుత్వ సర్వజన అసుపత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు కోరారు. శుక్రవారం లోక్‌సభలో ఆయన కర్నూలు అసుపత్రిపై ప్రత్యేకంగా మాట్లాడారు. కర్నూలు జిల్లా కరవు ప్రాంతమని, కర్నూలు ప్రభుత్వ అసుపత్రికి దాదాపు 8 జిల్లాల నుంచి వస్తుంటారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేయాలన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య

- అయ్యలూరి మెట్ట పొలాల్లో ఘటన
- వేటకొడవళ్లతో దాడి



వెంకటసాయి (ఫైల్)

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 2: నంద్యాల పట్టణానికి చెందిన రౌడీషీటర్ వెంకటసాయి అలియాస్ కవ్వ (30) శుక్రవారం దారుణ హత్యకు గురయ్యాడు. నంద్యాల మండలం అయ్యలూరి మెట్ట పొలాల్లోని ఓ వెంచర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్ళతో అతికిరాతకంగా దాడి చేయడంతో వెంకటసాయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల టౌన్ గుడిపాడిగడ్డకు చెందిన వెంకటసాయి అలియాస్ కవ్వ అనే రౌడీషీటర్ 2022 ఆగస్టు 8వ తేదీన నంద్యాల డీఎస్పీ కార్యాలయంలో పని చేస్తున్న కానిస్టేబుల్ సురేంద్ర హత్య కేసులో మొదటి ముద్దాయిగా ఉన్నాడు. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలలో వెంకటసాయిపై మర్డర్లు, హత్యాయత్నాలు, కిడ్నాప్‌లకు సంబంధించి మొత్తం 21 కేసులు ఉన్నాయి. ఓ కేసులో ముద్దాయిగా ఉంటూ ఇటీవలే కడప సబ్‌జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చాడు. శుక్రవారం వెంకటసాయిని కొంతమంది వ్యక్తులు అయ్యలూరి మెట్ట పొలాల్లోని ఓ వెంచర్‌లోకి పిలుచుకు వచ్చి మద్యం తాగించారు. పథకం ప్రకారం ముందుగా తెచ్చుకున్న వేటకొడవళ్ళతో దాడికి పాల్పడ్డారు. ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు వెంకటసాయి పరుగెత్తుతుండగా వెంటపడి మరి వీపు, మెడపై విచక్షణారహితంగా దాడులు చేసి నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా, డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, తాలూకా పోలీస్ అధికారులు చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. ఇటీవల ఆళ్లగడ్డలో అఖిలప్రియ ఇంటి ఎదుట ఆమె పీఏ నిఖిల్‌పై హత్యాయత్నం కేసులో వెంకటసాయి నిందితుడిగా ఉన్నాడు. ఇదిలా ఉండగా మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు కూడా రౌడీషీటర్‌గా ఉండేవాడు. 27 సంవత్సరాల క్రితం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. మృతుడికి తల్లి లక్ష్మీదేవి, భార్య శైలజ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు తాలూకా సీఐ దస్తగిరి బాబు తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

నంద్యాల
నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

చెరువు ఆక్రమణలు తొలగిస్తేనే రైతులకు న్యాయం: ఎమ్మెల్యే



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, ఆగస్టు 2: చెరువు ఆక్రమణల తొలగింపుతోనే రైతులకు న్యాయం జరుగుతుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సుబ్బరాయుడి కొత్తూరులో శుక్రవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. కొండజూటూరు గ్రామానికి చెందిన రైతులు తమ పంటపొలాలు చెరువు ఆక్రమణతో పంటలు నీటికి ముంపుకు గురయ్యాయని తెలిపారు. దీనిపై మైనర్‌ఇరిగేషన్ ఈఈ రఘురామిరెడ్డితో ఆమె మాట్లాడి సమస్యపై తెలుసుకున్నారు. చెరువు ఆక్రమణకు గురైందని, చెరువులో రహదారి, ఇంటి నిర్మాణాలు, కళ్లాలు, తదితర ఆక్రమణలు చోటు చేసుకున్నాయని ఈఈ ఎమ్మెల్యేకు తెలిపారు. వైసీపీ నాయకుల ఆక్రమణలతో వంద ఎకరాల పంటలు నీట మునిగాయని రైతులు చెప్పారు. చెరువు ఆక్రమణలను త్వరలో పరిశీలించి ఆక్రమణలను తొలగించే కార్యక్రమం చేపట్టి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నాయకులు జయరామిరెడ్డి, మిలిటరీ సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, దుర్వేశి కృష్ణ యాదవ్, ఆలయ ఈవో రామకృష్ణ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగతనాలపై ఎమ్మెల్యే ఆరా

మండలంలో ఇటీవల పెరుగుతున్న దొంగతనాలపై ఆమె ఆరా తీశారు. పోలీసుశాఖతో చర్చించి చోరీలకు కారణాలు తెలుసుకుంటామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులు విధుల పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. ఈనెల 1వ తేదీన గోరుకల్లులో జరిగిన ఆరు దుకాణాలలో జరిగిన చోరీలపై ఆమె ఆరా తీశారు. రాత్రివేళల్లో గస్తీ పెంచాలని పోలీసులను ఆదేశించారు.

వీపనగండ్లలో 'పొలం బడి'



రైతులకు సూచనలు ఇస్తున్న సైంటిస్టు డాక్టర్ రామకృష్ణ

మిడుతూరు, ఆగస్టు 2: మండలంలోని వీపనగండ్ల గ్రామంలో శుక్రవారం మొక్కజొన్న పంటలో గ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం జిల్లా ఏరువాక కేంద్రం, నంద్యాల ప్రిన్సిపల్ సైంటిస్టు, కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, వ్యవసాయాధికారి పీరునాయక్ పాల్గొని మొక్కజొన్న పంట గ్యాప్‌పై రైతులకు సూచనలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో ప్రస్తుతం కత్తెర పురుగు ఆశించి నష్టం కలుగజేస్తున్నట్లు తెలిపారు. మొక్కజొన్న విత్తిన 25 రోజుల వరకు కత్తెరు పురుగు నివారణకు ఎకరానికి 200 లీటర్ల నీటిలో 10000 పీపీఎం గాడత కలిగిన 400 మి.లీ. వేపనూనె కలిపి పిచికారీ చేయాలని అన్నారు. కత్తెర పురుగు లార్వాను నివారించేందుకు విత్తిన 25 రోజు నుంచి 40 రోజుల వరకు 5-20 శాతం మొక్కజొన్న ఆకులు దెబ్బతింటే పురుగు మందులు ఎకరానికి 80 గ్రాముల ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా, స్పైనోటరామ్ 100 మి.లీ. ఎకరానికి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. పురుగు ఆశించిన పంటలో కింద తెలిపిన మందులలో ఏదైనా ఒకదానిని పిచికారీ చేయాలని అన్నారు. ఎకరానికి స్పైనోసాడ్ 70 మి.లీ., రైనాక్సీఫైర్ 80 మి.లీ., స్పైనోటరామ్ 100 మి.లీ, ఎమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు పిచికారీ చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల వీఏఏలు రాము, అశోక్, రైతులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం



ఆత్మకూరులో సంబరాలు జరుపుకుంటున్న మాదిగలు

ఆత్మకూరు, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంపై ఆత్మకూరు పట్టణంలో శుక్రవారం మాదిగ కులస్థులు సంబరాలు జరుకున్నారు. టీడీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్ తిమోది ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ ఒఘం నాయకులు సురేష్, పుల్లయ్య కీర్తి, రవి, కిశోర్ తదితరులు ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణ తీర్పును పునఃపరిశీలించాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని మాలమహానాడు నాయకులు మల్లయ్య, కేశాలు, మల్లె ఎలీషా, చింతలయ్య కోరారు. ఎస్సీ వర్గీకరణపై తీర్పును నిరసిస్తూ శుక్రవారం మాలమహానాడు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని, ఈ తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టులో తాము పిటిషన్ వేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, రాఘవేంద్ర, అంకిరెడ్డి, అంకన్న, రాజు, కిష్టఫర్ తదితరులు ఉన్నారు.

'పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం'

మహానంది, ఆగస్టు 2: గ్రామాల్లోని ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకొంటే అంటు రోగాలు సోకవని గోపవరం పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్ అన్నారు. శుక్రవారం మహానంది మండలం గోపవరం గ్రామంలో డ్రై డే పురస్కరించుకొని గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది డ్రైనేజీ కాల్వలతో పాటు నీటి నిల్వలను తొలగించారు. అలాగే దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. గాజులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటరెడ్డి గ్రామంలో సిబ్బంది చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు.

సిద్ధేశ్వరం బ్యారేజీ హామీపై హర్షం

ఆత్మకూరు, ఆగస్టు 2: శ్రీశైలం పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబు సిద్ధేశ్వరం వద్ద కృష్ణానదిపై బ్యారేజ్‌ని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ముందుకెళ్తామని హామీ ఇవ్వడంపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం కోసం రైతులు అనేక రూపాల్లో ఉద్యమాలు చేశారని అన్నారు. అయితే సీఎం చంద్రబాబు ఎట్టకేలకు సిద్ధేశ్వర్యం బ్యారేజీ నిర్మాణంపై సానుకూలంగా స్పందించడం సంతోషకరమని అన్నారు.

వాహనదారుల అవస్థలు

● గుంతలమయంగా మారిన రహదారులు
● ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు





అధ్వానంగా మారిన పీర్‌సాహెబ్ పేట, పైపాలెం గ్రామాల రహదారులు

మిడుతూరు, ఆగస్టు 2: మండల పరిధిలోని పీరుసాహేబ్ పేట గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షానికే గుంతలు చెరువుల్లా తలపిస్తున్నాయి. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు రాత్రి వేళల్లో స్థానికులు ప్రయాణించడం ఇబ్బందిగా మారిందని ఈ రోడ్డు బాగు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నందికొట్కూరు నుంచి నంద్యాల మీదుగా వెళ్ల ప్రదాన రహదారి వెంబడి ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. రోడ్డుపై గుంతలు ఏర్పడి రోడ్డులో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు గురవుతున్నాయి. కడుమూరు నుంచి పైపాలెం వెళ్లే రహదారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రోడ్డు అధ్వానంగా ఉండడం వల్ల మండలంలో ఏదో ఒక రహదారి మార్గంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కడుమూరు నుంచి దేవనూరు, చౌట్కూరు వెళ్లే రహదారి పరిస్థితి ఇలాగే ఉంది. దీనికి తోడు వర్షాకాలం కావడంతో నీటితో నిండిన గుంతలను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా రహదారుల వెంబడి గుంతలు, ఎగుడు దిగుడు రోడ్డే దర్శనమిస్తున్నాయి. రహదారుల పరిస్థితి అధానంగా ఉన్నా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



జలాశయం గేట్లు ఎత్తుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు, ఆగస్టు 2: రైతుల సంక్షేమమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం వెలుగోడు జలాశయ మెయిన్ హెడ్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తి మద్రాసు కాలువకు నీటిని విడుదల చేశారు. అంతకు ముందు జలాశయ గేట్ల వద్ద ప్రత్యేక పజూజలు చేసి గేట్లను ఎత్తారు. అనంతరం గంగమ్మకు చీర, సారె సమర్పించి గంగాహారతి ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయలసీమ రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఎకరాకు సాగునీటిని అందిస్తామన్నారు. ఇక నుంచి ప్రతి ఏటా రైతులు రెండుకార్లు పండించుకునేందుకు సాగు నీరు అందిస్తామన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు జలాశయానికి చెందిన జీరో నుంచి 18 కిలోమీటర్ల వరకు లైనింగ్ పనుల కోసం నిధులు మంజూరు చేయిస్తే, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పూర్తిచేయకపోవడం దారుణమని అన్నారు. ఉదయం ఎమ్మెల్యే 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, తెలుగుగంగ అధికారులు మధ్యాహ్నం వెయ్యి, సాయంత్రం మరో వెయ్యి క్యూసెక్కుల చొప్పున రెండు గేట్ల ద్వారా మద్రాసు కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం ఈ నీటిని 5 వేల క్యూసెక్కులకు పెంచనున్నట్లు అధికారులు తెలిపారు. తెలుగుగంగ ఎస్ఈ సుబ్బరాయుడు, సీఈలు వెంకటేశ్వర్లు చెట్టి, డీఈలు, ఏఈలు, టీడీపీ నాయకులు శేషిరెడ్డి, కలాం, ఖలీల్, హంజా, చంద్ర, రామానాయుడు జాకీర్‌హుసేన్, శంకర్‌రెడ్డి, సూర్యనారాయణ ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

● జీవిత బీమాతోనే కుటుంబాలకు ధీమా ఉంటుందని ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి అన్నారు. వెలుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నాగలక్ష్మమ్మ అనే మహిళ పంట రుణం తీసుకుంది. ఆమె గత ఏడాది ఆగస్టు 14న ఆటో ప్రమాదంతో మృతి చెందారు.. ఆమెకు జనతా ఆక్సిడెంట్ పాలసీ కింద రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆమె భర్త లక్ష్మన్నకు ఎమ్మెల్యే అందజేశారు. కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ భూమా నారాయణ రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనాథ్, సీఈవో జంబులయ్య, టీడీపీ నాయకులే అంబాల రామకృష్ణారెడ్డి, రఘుస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల జాప్యంపై సభ్యుల ఆగ్రహం

● రసాభాసగా మారిన మండల సమావేశం

పగిడ్యాల, ఆగస్టు 2: సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేసినప్పటికీ బిల్లుల చెల్లింపులో అధికారులు జాప్యం చేస్తుండటంతో అధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మల్లీశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు ఆ శాఖ ప్రగతి నివేదికలు వివరించారు. పగిడ్యాలలో ఎంపీపీ నిధులు రూ. 12 లక్షలతో 241 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించి నెలలు గడుస్తున్నా బిల్లుల చెల్లింపునకు అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని జడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య, సర్పంచ్ శేషన్న ప్రశ్నించారు. ఈ విషయంపై ఎంపీడీవో కవిరాజ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ సమయంలో తీర్మానాలు లేకుండా పనులు చేసినట్లు ఎంపీటీసీ సభ్యులు జయంతి, గోపాల్‌లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారని, పీఆర్ ఏఈని విచారణ చేపట్టిన తరువాత బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అయితే ఎంపీటీసీలకు ఎలాంటి సంబంధం లేదని, కొందరు వారి సంతకాలను ఫోర్జరీ చేశారని సర్పంచ్ చెప్పగా.. దీనిపై కూడా విచారిస్తామని చెప్పారు. పగిడ్యాల ఎంపీపీ పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించేందుకు అవసరమైన నిధుల కోసం గత సమావేశంలో తీర్మానించినప్పటికీ పనులు చేపట్టకపోవడంతో కార్యాలయ ఏవో నాగరాజుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారని ఎంఈవో సుబాన్ చెప్పారు. వారంలోపు ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ విద్యుత్ శాఖ ఏఈ క్రాంతి కుమార్‌కు ఆదేశించారు. లక్ష్మాపురంలో గృహల వినియోగానికి, వ్యవసాయానికి సింగిల్ ఫేస్ కనెక్షన్ ఉండటంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోందని కో-ఆప్షన్ సభ్యుడు అస్లాంబాషా, ఎంపీటీసీ గౌరమ్మ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ సమాచారం కోసం సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే సిబ్బంది సమాచారం ఇవ్వడం లేదని సభ్యులు ఆరోపించారు.

ఎంపీటీసీకి సర్పంచ్ క్షమాపణ: లక్ష్మాపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ గౌరమ్మకు గ్రామ సర్పచ్ సుజాత క్షమాపణ చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ గౌరమ్మ అధికారులకు పలు సమస్యలు తెలిపారు. గ్రామంలో పైప్‌లైన్ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంలో తమ పేరు ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. శిలాఫలకంలో తన పేరు వేయించకుండా అవమానించారన్నారు. దీంతో ఎంపీపీ సర్పంచ్ సుజాతను వివరణ ఇవ్వాలని కోరారు. ఎన్నికల కోడ్ వస్తుందన్న కారణంగా త్వరితగతిన ప్రారంభించామని, మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని క్షమాపణలు కోరారు.

'యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి'



రాయమాల్పురంలో వరినారు మడులను పరిశీలిస్తున్న ఏవో

నంద్యాల రూరల్, ఆగస్టు 2: యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు అన్నారు. మండలంలోని రాయమాల్పురం, మునగాల గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేసి అనంతరం వరినారు మడులను పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ ఐదు సెంట్ల నారుమడికి రెండు కేజీల నత్రజని, కేజీ భాస్వరం, పొటాషియం ఎరువులు వాడాలని సూచించారు. అలాగే రెండు గ్రాముల జింకును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్బోఫురాన్ గుళికలు 160 గ్రాములు వాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులతో పాటు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'రాజకీయ వేధింపులు ఆపాలి'

ఆత్మకూరు, ఆగస్టు 2: స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లపై రాజకీయ నాయకుల వేధింపులను నిరసిస్తూ ఈనెల 5వ తేదీన చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా దేశంలో లక్షలాదిగా ఉన్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం తదితర స్కీమ్ వర్కర్లకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించి జీతంలో సగం పింఛన్ సదుపాయం కల్పించాలని కోరారు. అలాగే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు రజాక్, భాస్కర్, కలీముల్లా, రణధీర్ తదితరులు ఉన్నారు.

'బయో ఉత్పత్తులు అమ్మితే చర్యలు'

పాములపాడు, ఆగస్టు 2: పురుగు మందుల దుకాణదారులు అనుమతుల్లేని బయో ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆంజనేయ హెచ్చరించారు. పాములపాడులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణాలలో స్టాక్ రిజిస్టర్లు ఉండాలని, స్టాకు నిల్వల బోర్డును ఏర్పాటు చేయాలని, అనుమతులు ఉన్న మందులను మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించకూడదని ఆదేశించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, పురుగుమందులు, ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. పది మందిపై కేసు

మహానంది, ఆగస్టు 2: మహానంది సమీపంలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో గురువారం అర్ధరాత్రి ఇరువర్గాలకు చెందిన 10 మంది ఘర్షణ పడటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. కాలనీకి చెందిన బంగి రమేష్, అంజి, సురేష్, చినబాబుతో పాటు మరో వ్యక్తి అదే కాలనీకి చెందిన భూపాల్, సుంకన్న, శ్యామ్, శ్రీకాంత్, మహేష్‌పై వ్యక్తిగత కక్షలతో ఘర్షణ పడ్డారని చెప్పారు. ఇందులో భూపాల్ తీవ్రంగా గాయపడ్డాడని చెప్పారు. అలాగే ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన బంగి వెంకటేశ్వర్లు ఇంటిపై భూపాల్ వర్గీయులు దాడి చేసి ఇంటిలోని వస్తువులతో పాటు కారును ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత

నందికొట్కూరు, ఆగస్టు 2: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరు మున్సిపాల్టీ పరిధిలోని మూడో సచివాలయం పరిధిలో నివాసం ఉంటున్న ఎం. శ్యామలమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. 3వ వార్డు సచివాలయ ఉద్యోగి బాలబిచ్చన్న విషయం తెలుసుకొని ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలన్న మంచి మనస్సుతో కర్నూలు నగరంలో ఉన్నటువంటి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి రూ.4 వేలు నగదును అందజేశారు. ఇందుకుగాను కుటుంబ సభ్యులు ఆ ఉద్యోగికి కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని 12 గ్రామ పంచాయితీల్లో శుక్రవారం సాయంత్రానికి 99.5 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో గువ్వలకుంట్లలో సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

'తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం'



నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 2: శిశువుకు తల్లి పాలే శ్రేయస్కరమని నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాదరావు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రుల్లా ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఐఎంఏ ఆధ్వర్యంలో జీజీహెచ్లోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి అధికారులు ఐఎంఎ వైద్య బృందం బాలింతలు గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. లయన్స్ క్లబ్ ఐఎంఎ ప్రతినిధులు ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ పోషణతో పాటు ఆరోగ్యంగా ఉంటుందని గాజులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటరెడ్డి తెలిపారు. గోపవరంలో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రసన్నలక్ష్మి, నిర్మల, తేజస్విని, సిబ్బంది రమేష్, ఉద్యానవనశాఖాధికారి హరిత, మహిళా పోలీస్ అరుణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరనుందని ఏఎన్ఎంలు సుబ్బలక్ష్మీ, ప్రశాంతి, లక్ష్మీదేవి అన్నారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో గల సచివాలయంలో 3,6,7,11,28,33,38 అంగన్‌వాడీల సెంటర్ల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గడివేముల: తల్లిపాలు బిడ్డకు సంజీవని వంటిదని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. మంచాలకట్ట గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మంచాలకట్ట గ్రామంలో..

విద్యార్థులకు అస్వస్థత

● ఓ వైసీపీ నాయకుడికి చెందిన పాఠశాలలో ఫుడ్ పాయిజన్
● గుట్టుచప్పుడు కాకుండా పాఠశాలలోనే చికిత్స



పాఠశాలలో విచారణకు వచ్చిన ఆర్డీవో మల్లికార్జునరెడ్డి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 2: నంద్యాల పట్టణ శివారులోని ఓ వైసీపీ నాయకుడికి చెందిన ఓ ప్రముఖ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఫుడ్ పాయిజన్ జరిగింది. విద్యార్థులను చికిత్స నిమిత్తం బయట ఆసుపత్రికి తీసుకొని వస్తే విషయం పొక్కుతుందని పాఠశాల యాజమాన్యం గోప్యంగా ఉంచింది. గురువారం రాత్రి ఆపాఠశాల అధినేత పుట్టిన రోజు వేడుకలు పాఠశాలలో ఆవరణలో జరిగాయి. గురువారం రాత్రి తిన్న భోజనంలో శుక్రవారానికి విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయినట్లు విశ్వసనీయ సమాచారం. నంద్యాలకు చెందిన రెండు ప్రముఖ ఆసుపత్రుల వైద్యులతో పాఠశాలలోనే చికిత్స చేసినట్లు తెలుస్తోంది. పాఠశాల నుంచి శుక్రవారం అంబులెన్స్ వెళ్లడం రాకపోకలు, వైద్యుల వాహనాల రాకపోకల తో విషయం నిజమేనని బయట పడింది. కొందరు విద్యార్థులను తల్లితండ్రులు ఆటోలో తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పాత్రికేయులు శుక్రవారం రాత్రి పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలలోకి సెక్యూరిటీ గార్డు అనుమతించలేదు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోలేదని బుకాయించారు. ఈ వార్త కాస్తా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆర్డీవో మల్లిఖార్జునరెడ్డి, డీఈవో సుధాకర్‌రెడ్డిలు వెంటనే స్పందించి ఎంఈవో బ్రహ్మంను విచారణ చేపట్టాలని ఆదేశించారు. విద్యాశాఖాధికారి, ఆర్డీవో కార్యాలయానికి చెందిన మరొకరు పాఠశాల వద్దకు రాగానే యజమాన్యం పాఠశాల లోపలికి పంపించింది. పాఠశాల లోపల ఎంఈవో విద్యార్థుల హాస్టల్ గదులను పరిశీలించగా ఓఆర్ఎస్ పాకెట్లు విద్యార్థులు వాంతులు చేసుకున్న చోట శుభ్రపరచడం, బాత్‌రూమ్‌లలో విద్యార్థులు వాంతులు చేసుకున్న ఘటన వాస్తవమే అని నిర్ధారించికుని ఆర్డీఓ మల్లిఖార్జున రెడ్డికి విషయం తెలిపారు. దీంతో ఆర్డీవో మల్లికార్జున రెడ్డి నేరుగా అర్ధరాత్రి పాఠశాలకు వద్దకు వచ్చి విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగిన విషయం విచారణలో తేలింది. దాదాపు 30 మంది విద్యార్థులు అవస్థతకు గురైనట్లు తెలిసింది. జరిగిన విషయాన్ని గోప్యంగా ఉంచకుండా బయట చికిత్స అందించి ఉంటే బాగుండేదని అన్నారు. ఈ ఘటనపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని చెప్పారు.

దుర్గా భోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

గడివేముల, ఆగస్టు 2: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు వేకువ జాము నుంచి ఆలయ ప్రాంగణంలోని పంచకోనేర్లలో స్నానాలు ఆచరించి స్వామి వారికి మహన్యాస రుద్రాభిషేకం, రుద్ర హోమాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యాలు కలగ కుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా ఊయల సేవ

శ్రీశైలం, ఆగస్టు 2: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహా గణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోప చార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళహారతులను సమర్పించారు.

● శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన నిర్వహించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఆగస్టు 2: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శుక్రవారం విశాఖపట్టణానికి చెందిన కళారాధన సంగీత నృత్య అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, శివ పంచాక్షరీ స్తోత్రం, శంకర శశివదన, కాలభైరవాష్టకం, అయిగిరినందిని, గిరిజకల్యాణం తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

మెరుగైన సేవలు అందిస్తాం: జేసీ

నంద్యాల కల్చరల్, ఆగస్టు 2: ప్రజలకు మెరుగైన సేవలను అందించడంలో భాగంగా పౌర సరఫరా విభాగంలో మార్పులు చేసి నాణ్యమైన సరుకులను అందిస్తామని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఓపెన్ హాస్‌లో పౌర సరఫరాల వ్యవస్థ పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ ప్రజలకు నాణ్యమైన సరుకులను పౌరసరఫరాల వ్యవస్థ ద్వారా అందించేందుకు జిల్లా వ్యాప్తంగా రైస్ కార్డుదారుల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తెలుసుకోవడానికి ప్రజాభిప్రాయ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో నంద్యాల జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరాముడు, సివిల్ సప్లై కార్పొరేషన్ డీఎంతో పాటు ఐసీడీఎస్, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఏఎస్‌వో రవిబాబు, నంద్యాల సీఎస్‌డీటీ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాళ్లు, ట్రైబల్ అధికారి పాల్గొన్నారు.

ఎవరు ఫోన్ చేసినా స్పందిస్తా: ఎస్పీ

నంద్యాల క్రైం, ఆగస్టు 2: ఎవరు ఫోన్ చేసినా స్పందిస్తానని, అలాగే మీ సమస్యల పరిష్కారానికి సంబంధించిన సమాచారం తెలియజేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శుక్రవారం ఒక ప్రకటనలో చెప్పారు. జిల్లా ప్రజలు సెంట్రల్ కంప్లైంట్ సెల్ (సీసీసీ), ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు సంబంధించిన ఫిర్యాదుల సమాచారం తెలుసుకోవడానికి నేరుగా తనతో మాట్లాడాలనుకుంటే 9154987020కు కాల్ చేయవచ్చని తెలిపారు. సమస్యలపైనే కాకుండా శాంతిభద్రతలకు సంబంధించిన విషయాల్లోనూ ఫోన్ చేయవచ్చన్నారు. ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి, జాబ్ ఇప్పిస్తామని మోసం చేసినా, బిట్‌కాయిన్స్‌కు సంబంధించి, లోన్ యాప్‌లలో మోసపోయినా, మరే ఇతర సైబర్ మోసాలకు గురైనవారైనా మొదట 1930 నెంబర్‌కు లేదా సైబర్ క్రైం ప్రభుత్వ వెబ్‌సైట్లో కాని, జిల్లా సైబర్ క్రైం ఆఫీస్‌ను గాని సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

'దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 2: పేద విద్యార్థుల అభ్యున్నతికి దాతలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని గోస్పాడు మండలం దీబగుంట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలచంద్రుడు సూచించారు. నంద్యాల బెస్త సేవాసంఘం ఆధ్వర్యంలో గోస్పాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న బెస్త విద్యార్థులకు ఎంపీసీ, సీఈసీ, గ్రూపు పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందజేశారు. సంఘం సభ్యులు పుట్టా శివ, రమేష్, బాలాజి, అధ్యాపకుడు సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి ఇన్‌చార్జి ఎంఈవోగా బ్రహ్మం నాయక్

కొత్తపల్లి, ఆగస్టు 2: కొత్తపల్లి మండల ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారిగా బ్రహ్మం నాయక్ బాధ్యతలు చేపట్టారు. గత నెల 31న ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంఈవో శ్రీరాములు పదవీ విరమణ పొందారు. ఈ మేరకు ప్రభుత్వం వెలుగోడు రెగ్యులర్ ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న బ్రహ్మం నాయక్ కొత్తపల్లి ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు అప్పజెప్పారు. ఈ మేరకు ఆయనకు రిటైర్డు ఎంఈవో శ్రీరాములు పాలనాపరమైన రికార్డులను అప్పగించారు.

టీడీపీతోనే పేద ప్రజల సంక్షేమం: ఎమ్మెల్యే


కోట్ల దంపతులను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

బేతంచెర్ల, ఆగస్టు 2: రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య అధ్యక్షత టీడీపీ నాయకులు కార్యకర్తలు పూలమాలలతో, గజమాలతో ఎమ్మెల్యే కోట్లను, ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కూతురు కోట్ల చిత్రమ్మను సన్మానించారు. ముందుగా రూ.12 లక్షలతో నిర్మించే లైబ్రరీ భవనానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగించిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వర రావు యాదవ్, మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, సీనియర్ నాయకులు పోలూరు రాఘవరావు, పోలూరు శ్రీనివాసరెడ్డి, తిరుమలేష్ చౌదరి, భీమేశ్వరరెడ్డి, ఉన్నం వెంకటేశ్వర్లు, జావాజి వెంకటేశ్వర్లు, నారాయణ స్వామి, రవీంద్ర నాయక్, రూబెన్, రెహిమాన్‌పురం వెంకటేశ్వరగౌడు పాల్గొన్నారు.

కోట్ల సుజాతమ్మను కలిసిన టీడీపీ నాయకులు

బేతంచెర్ల, ఆగస్టు 2: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో శుక్రవారం జరిగిన టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి హాజరైన డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్‌లను సిమెంటునగర్ టీడీపీ నాయ కులు కలిసి పార్టీ పరిస్థితి గురించి వివరించారు. కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమేశ్వరరెడ్డి, రాముడు, ఉరుకుంద, వాసు, వెంకటేశ్వర్లు, బాషా పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్లకు దరఖాస్తు చేసుకోండి

సంజామల, ఆగస్టు 2: పాడిపశువులు, గొర్రెల, మేకలు, కోళ్ల పెంపకందారులు మినీ గోకులం షెడ్లకు దరఖాస్తు చేసుకోవాలని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకుడు మోహన్‌రావు రైతులకు సూచించారు. శుక్రవారం సంజామల ప్రాంతీయ పశువైద్యశాలలో పశువైద్యాధికారులు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ పశువులకు ప్రబలే వ్యాధులపై అప్రమత్తం గా ఉండాలని, రైతులు పశువులకు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించాలని అన్నారు. 2,4,6 పాడిపశువులు ఉన్న రైతులు ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో షెడ్లను నిర్మిస్తుందన్నారు. గొర్రెల, మేకలు, కోళ్ల పెంపకందారులకు 70శాతం సబ్సిడీని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రమేష్ బాబు, రఘుబాలకృష్ణ, పద్మావతి, కస్తూరి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

బేతంచెర్ల, ఆగస్టు 2: నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఖాళీ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ రమేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం శేషారెడ్డి సర్కిల్ దగ్గర 3వ వార్డులో ఎల్‌పీ.నెం.78/91 సర్వే.నెం.219లో ప్రభుత్వ స్థలంలో 288.758 చద రపు గజాల స్థలాన్ని పద్మనాభం యాదవ్ భార్య గొల్ల లావణ్య పేరు న సబ్ రిజిస్ట్రర్ నకిలీ ధ్రువీకరణ పత్రాలతో బేతంచెర్ల కార్యాల యంలో డాక్యుమెంట్లు 183/2024న రిజిస్ట్రర్ చేయించుకున్నారని ఆయన వివరించారు. ఇది చట్ట రీత్యా నేరమని, ప్రస్తుత రిజిస్ట్రేష న్‌ను బేతంచెర్ల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నిషేధిత జాబితాలో చేర్చామన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

డోన్, ఆగస్టు 2: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని సాయిశ్రీ డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఐటీ, ఫార్మసీ, సెక్యూరిటీ తదితర రంగాల్లో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. డోన్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువ త ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయ ఉద్యోగి మానవత్వం

ప్యాపిలి, ఆగస్టు 2: కర్నూలులో చికిత్స పొందుతున్న బాధితురాలికి ఆమెకు తోడుగా వెళ్లిన మహిళకు పింఛన్ అందజేసి సచివాలయ ఉద్యోగి మురళి మానవత్వం చాటారు. పట్టణానికి చెందిన గోవిందమ్మ అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు తోడుగా సమీప బంధువు తిమ్మక్క అక్కడనే ఉంటోంది. అయితే 1న అనారోగ్యం కారణంగా పింఛన్ కోసం ఇద్దరు మహిళలు ఇక్కడికి రాలేకపోయారు. విషయం తెలుసున్న ఉద్యోగి మురళి శుక్రవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఇద్దరు మహిళలకు పింఛన్ డబ్బులను అందజేశారు.

న్యాయవాది దాతృత్వం

డోన్(రూరల్), ఆగస్టు 2: పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది పి.మస్తాన్‌వలి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. రూ.20 వేల విలువ చేసే క్యాన్సర్ మందులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి క్యాన్సర్ వార్డులో హెచ్‌వోడీ డా. కృష్ణప్రసాద్‌కు అందజేశారు.

ఘనంగా బోనాల జాతర


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ప్యాపిలి, ఆగస్టు 2: పట్టణంలో శుక్రవారం పెద్దమ్మ బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనా లను ఊరేగిస్తూ తీసుకెళ్లి పెద్దమ్మ అమ్మవారికి సమర్పించారు. ఆషాఢ మాసంలో పెద్దమ్మకు సమర్పిస్తే వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని భక్తులు, గ్రామపెద్దలు తెలిపారు.

వైద్య సిబ్బందికి సన్మానం


ప్రభుత్వ ఆసుపత్రి సన్మాన గ్రహీతలతో రోటరీ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల, ఆగస్టు 2: గ్రామాల్లోని పేద ప్రజలకు ఉత్తమ వైద్య సేవలందించిన ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో 30 మంది వైద్య సిబ్బందికి రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న 30 మంది వైద్యఆరోగ్య సిబ్బందికి శాలువలతో సన్మానించి ప్రోత్సాహక బహుమతులు రోటరీ క్లబ్ సభ్యులు ప్రేమ్ స్వరూప సహకారంతో అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాగరిక మాట్లాడుతూ రోటరీ క్లబ్ సభ్యులు వైద్య సిబ్బంది సేవలను గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ చరణ్ రాజు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ సభ్యులు సత్తార్, వీరభద్రారెడ్డి, సయ్యద్ అహ్మద్, మాణిక్యంశెట్టి, మక్బూల్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై చారిత్రాత్మక తీర్పు

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోట్ల నివాసంలో ఎమ్మెల్యే కోట్లను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టన్న మాదిగ, గంధం శ్రీనివాసులు, డోన్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు రాముడు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పెద్ద రామచంద్రుడు తదితరులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేసి తొలి అడుగు వేశారన్నారు. ఎన్నో ఏళ్లుగా మాదిగల పోరాడి ఎస్సీ వర్గీకరణను సాధించుకున్నారని అన్నారు.

● **సుబ్బారెడ్డిని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు:** టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డిని శుక్రవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టన్న మాదిగ, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఉంగరానిగుండ్ల రాముడు తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

ప్రాణాలర్పించిన కార్యకర్తలకు సుప్రీం తీర్పు అంకితం

కొలిమిగుండ్ల: దేశ అత్యున్నత న్యాయ స్థానం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు జాతి కోసం ప్రాణాలర్పించిన కార్యకర్తలకు అంకితమని ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు దస్తగిరి, శివనారాయణ, నాగాంజనేయులు అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంతోషం వ్యక్తం చేస్తూ, మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

● **బెలుంశింగవరంలో:** మండలంలోని బెలుం శింగవరం గ్రామంలో ఏపీ ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు క్రిష్టయ్య, పెద్దయ్య, రామాంజనే యులు, తిమ్మక్క, పుల్లక్క, బాలలక్ష్మమ్మ ఎమ్మార్పీస్ కార్యకర్తలు సంబరాలు చేశారు. ర్యాలీ నిర్వహించి కేకు కట్ చేశారు.

సంజామల: 30 సంవత్సరాల మాదిగల ఆకాంక్ష నెరవేరిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శివనారాయణ అన్నారు. శుక్రవారం ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన బిల్లు అత్యున్నత న్యాయస్థానంలో తీర్పు వెలువడటంతో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. సంజామల ఎస్సీ కాలనీలోని రామాలయం వద్ద ఎం.ఆర్.పి.ఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.


కోట్లను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోవెలకుంట్ల: పట్టణంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బస్టాండు నుంచి గ్రామ పంచాయతీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఓబులేసు మాట్లా డుతూ మందక్రిష్ణ మాదిగ 30 సంవత్సరాల దండోరా ఉద్యమం వల్లనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాదిగలకు హామీ ఇచ్చారని ఆ మేరకు నెరవేర్చారన్నారు. అనంతరం మోడీ, మాన్య మందాక్రిష్ణమాదిగ చిత్రపటాలకు క్షీభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, జిల్లా అధ్యక్షుడు కత్తి ఓబులేసు, కత్తి బాల సుబ్బయ్య, లాయర్ ఇంద్రకుమార్, పెద్దమునెయ్య, నాగేశ్వర్‌రావు, చిన్నపెద్దన్న, మద్దిలేటి, మాదిగ కిరణ్, మాదిగ రామాంజనేయులు, బాలనాగన్న, మాదిగ సుబ్బారావు, నాగన్న పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

డోన్(రూరల్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు డోన్ టీడీపీ నాయకుడు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సీలం భాస్కర్ నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు ఎస్సీ వర్గీకరణకు సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అందులో భాగంగా ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కూడా కట్టుబడి ఉందన్నారు.


ధర్మవరం సుబ్బారెడ్డిని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కొలిమిగుండ్లలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు, కోవెలకుంట్లలో.. సంజామలలో..

విద్యా ప్రమాణాలు పెంచాలి: డీఈవో


మాట్లాడుతున్న డీఈవో సుధాకర్‌రెడ్డి

చాగలమర్రి, ఆగస్టు 2: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో సుధాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని చిన్నవంగలి ఉన్నత పాఠశాల, చాగలమర్రి కేజీబీవీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. చిన్నవంగలి పాఠశాలలో విద్యార్థుల గ్రేడింగ్‌ను, నోట్ పుస్తకాలను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బాలికల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రహరీ విషయమై ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తామన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్, బూట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో అనూరాధ, ఎస్‌వో సునీత, హెచ్‌ఎంలు జీవయ్య, కోటయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

'వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'


ప్రజలకు సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

శిరివెళ్ల, ఆగస్టు 2: దోమకాటుతో డెంగీ, మలేరియా జ్వరాలు, అలాగే అపరిశుభ్రత వల్ల వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు సూచించారు. శిరివెళ్లలోని రాములమాన్యం కాలనీలో డెంగీ పాజిటివ్ కేసును గుర్తించామన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కాలనీవాసులకు వివరించారు. దోమల లార్వా నివారణకు పైరేత్రిమ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. జిల్లాలో ఇప్పటి వరకు 121 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, ఈవోపీఆర్డీ నాగేంద్రుడు, ఏఎన్ఎమ్ బాలనాగమ్మ పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి'

ఆళ్లగడ్డ, ఆగస్టు 2: కళాశాలల్లో చదువు కుటుంన్న విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఈశ్వర్ వెంకట ప్రసాద్ సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రజ్ఞ విద్యా సంస్థల్లో న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా మాదక ద్రవ్యాలు- విద్యార్థులపై వాటి ప్రభావం అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం చైర్ పర్సన్ హేమలతారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ నగీనా, న్యాయవాదులు పాల్గొన్నారు.

శాకంబరిగా కాళికామాత


ఆళ్లగడ్డలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎస్ఐ

ఆళ్లగడ్డ, ఆగస్టు 2: ఆళ్లగడ్డ పట్టణంలోని ఆచారీ కాలనీలో వెలసిన కాళికామాత అమ్మవారిని శుక్రవారం కూరగాయలతో వేదపండితులు అలంకరించారు. కమిటీ అధ్యక్షుడు రవీంద్రాచారి అధ్యక్షతన అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ ఎస్ఐ నగీనాచే వేద పండితులు ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో మహిళా కమిటీ అధ్యక్షురాలు అనూరాధ, రామాచారి, వేణుగోపాల్ ఆచారి, మహిళలు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని బుగ్గమల్లేశ్వర ఆలయంలో ఆశాఢ మాసం ముగింపు సందర్భంగా శుక్రవారం మహిళలు పార్వతీదేవికి చీర, సారె సమర్పించి పండ్లు కూరగాయలతో అలంకరిం చారు. శాకంబరి అలంకారంలో అమ్మవారు కొలువుదీరారు. పార్వతీదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శివప్రసాదు, మేడా బాబు, ప్రసాద్, వినో ద్‌కుమార్, శ్రీనివాసులు, మహిళలు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

ఆళ్లగడ్డ, ఆగస్టు 2: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పింగళి వెంకయ్య 148 జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య తెలుగుజాతికి ఆదర్శమని నం ద్యాల జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శిరివెళ్ల, ఆగస్టు 2: శిరివెళ్లలోని తెలుగుపేటకు చెందిన సుంకి వెంకటలక్ష్మమ్మ(45) అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ శుక్రవారం తెలిపారు. వెంకట లక్ష్మమ్మ కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దోమల నివారణకు వెలిగించిన దోమల నివారణకు ఉపయోగించే కాయిల్ మంచం కింద ఉన్న పెట్రోల్‌తో నడిచే స్ప్రేయర్‌పై పడడంతో బుధవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వెంకట లక్ష్మమ్మకు నిప్పంటుకోవడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. బాధితురాలిని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. వెంకటలక్ష్మమ్మ కుమారుడు నీలకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

పశువుల కొట్టానికి నిప్పు

శిరివెళ్ల, ఆగస్టు 2: మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన కేడం జగదీష్ చంద్రబోస్‌కు చెందిన పశువుల కొట్టానికి గురువారం రాత్రి నిప్పంటించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన కేడం చెన్నయ్య ఆస్తి తగాదాలను మనసులో పెట్టుకుని జగదీష్ చంద్రబోస్‌కు చెందిన పశువుల కొట్టానికి నిప్పంటించడంతో కొట్టం, పక్కనే ఉన్న ద్విచక్ర వాహనం దగ్ధమైనట్లు తెలిపారు. దీంతో రూ.35 వేల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు జగదీష్ చంద్రబోష్ ఫిర్యాదు చేయడంతో చెన్నయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

'విద్యార్థులు ప్రణాళికతో చదవాలి'

శిరివెళ్ల, ఆగస్టు 2: విద్యార్థులు సరైన ప్రణాళికతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సూచించారు. కళాశాలలోని ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 205 మంది విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరైన పాఠ్య, నోట్ పుస్తకాలను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

డోన్(రూరల్), ఆగస్టు 2: డోన్ మండలం ఇందిరాంపల్లి గ్రామంలో సుంకన్న, రామేశ్వర్‌లకు చెందిన నాలుగెకరాల్లో వేసిన పంటను నాశ నం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాంపల్లిలో నాశనం చేసిన సజ్జ, కంది పంటలను సీపీఐ బృందం పరిశీలించారు. అనంతరం డోన్‌లో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం లో రంగనాయుడు మాట్లాడుతూ గడ్డి మందుతో పంట నాశనం చేసిన నిందితులపై చర్యలు తీసుకోవడంలో డోన్ రూరల్ పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, సుంకయ్య, అనుబంధ సంఘాల నాయ కులు నారాయణ, సూర్యప్రతాప్ పాల్గొన్నారు.

'చిన్నారులకు తల్లిపాలు శ్రేష్ఠం'

శిరివెళ్ల, ఆగస్టు 2: చిన్నారులకు తల్లిపాలు శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్విని అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శిరివెళ్లలోని సచివాలయం-1లో గర్భిణులు, బాలింతలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణలత, వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ యామా గురప్ప, ఎంపీపీ మహమ్మద్ వసీం, సర్పంచ్ సాలమ్మ, ఉప సర్పంచ్ ఇంతియాజ్, మాజీ ఎంపీటీసీ బాలచంద్రుడు, నాగ లింగమయ్య, గోపాల్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సంజామల: అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శాంతి, సుగుణ అన్నారు. శుక్రవారం సంజామలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిపాల విశిష్టత గురించి అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

చాగలమర్రి: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్వరి అన్నారు. శుక్రవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు డాక్టర్ అంజలి, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు సుశీల, రామలింగారెడ్డి, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా పోలీసులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


శిరివెళ్లలో గర్భిణులకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో

దొర్నిపాడు: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని పీహెచ్ఎన్ భాగ్యమ్మ అన్నారు. మండలంలోని దొర్నిపాడు అంగన్‌వాడీ మూడవ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భం గా గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీహెచ్‌వో రవి, అంగన్‌వాడీ టీచర్ వెంకటసుబ్బమ్మ, ఆయాలు ఉన్నారు.

రుద్రవరం: తల్లి ముర్రుపాలు బిడ్డకు శ్రేయస్కరమని వైద్యాధికారి శివమోహన్ అన్నారు. శుక్రవారం రుద్రవరంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను పీహెచ్‌సీ వైద్యాధికారి శివమోహన్ జ్యోతి విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేసీ కాలువకు వెయ్యి క్యూసెక్కుల నీరు


మాట్లాడుతున్న ఈఈ తిరుమలేశ్వర్‌రెడ్డి

చాగలమర్రి, ఆగస్టు 2: మండలంలోని రాజోలి ఆనకట్ట నుంచి కేసీ ప్రధాన కాలువకు 1,000 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు నంద్యాల జిల్లా కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద నీటి ప్రవాహాన్ని శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ తుంగభద్రలో నీటి సామర్థ్యం 100 టీఎంసీలు ఉందని, బానకచర్ల డ్యామ్ నుంచి 10 వేల క్యూసెక్కుల నీటిని కుందూకు విడుదల చేశారని అన్నారు. రాజోలి ఆనకట్ట వద్ద 8 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని తెలిపారు. నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈ బ్రహ్మారెడ్డి, ఏఈలు జమాల్‌వలి, పవన్‌కుమార్‌రెడ్డి, సుబ్బరాయుడు ఉన్నారు.

నీటి విడుదల

చాగలమర్రి, ఆగస్టు 2: చాగలమర్రి మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద శుక్రవారం కేసీ ప్రధాన కాలువకు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ రాజోలి ఆనకట్ట పరిధిలోని కేసీ ఆయకట్టు రైతుల కళ నెరవేరుస్తామని అన్నారు. రాజోలి ఆనకట్ట వద్ద జలాశయం ఏర్పాటుకు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపాదనలు చేస్తామన్నారు. కేసీ కెనాల్ ఏఈ తిరుమలేశ్వర్‌రెడ్డి, డీఈ బ్రహ్మారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రమణారెడ్డి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి శేషయ్య, టీడీపీ నాయకులు శ్రీనివాస్, వెంకటరమణ, జమాల్‌వలి ఉన్నారు.

డొక్కా సీతమ్మ పేరు ప్రకటించడం అభినందనీయం

కొలిమిగుండ్ల, ఆగస్టు 2: ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా పేరుగాంచిన డొక్కా సీతమ్మ పేరును మధ్యాహ్న భోజన పథకానికి పెట్టడం అభినందనీయమని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. శుక్రవారం కనకాద్రిపల్లెలో ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం త్యాగమూర్తులను, మహనీయులను గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటమ ల్లారెడ్డి, పెద్దిరెడ్డి, రామిరెడ్డి, ఓబులేశు, రామలక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

కలచట్లలో పట్టపగలు చోరీ

ప్యాపిలి, ఆగస్టు 2: మండలంలోని కలచట్ల గ్రామంలో శుక్రవారం పట్టపగలు చోరీ జరిగింది. ఈ ఘటనలో 4తులాలు బంగారు, 12 తులాల వెండి, రూ.5వేలు నగదు అపహరణకు గురయ్యాయి. గ్రామానికి చెందిన బాలచంద్రశేఖర్ కుటుంబ సభ్యులు ఉదయమే పొలానికి వెళ్లారు. దీనిని పసిగట్టిన దొంగలు మధ్యాహ్న సమయంలో తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలోని బంగారు, వెండి నగలు, నగదున అపహరించుక పోయారు. సాయంత్ర పొలం నుంచి ఇంటికి వచ్చిన బాలచంద్రశేఖర్ చోరీ జరిగినట్లు గుర్తించి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు విచారిస్తామని పోలీసులు తెలిపారు.

'నలుగురి మృతి బాధాకరం'

చాగలమర్రి, ఆగస్టు 2: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడం బాధాకరమని టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నవంగలి గ్రామంలో మృతదేహాల వద్ద సంతాపం ప్రకటించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సర్పంచ్ మౌలిబాషా, టీడీపీ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఓబయ్య, నరేంద్రారెడ్డి, నర్సిరెడ్డి, గురుశేఖర్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

డ్రైనేజీల్లో ప్లాస్టిక్ బాటిళ్ల తొలగింపు

రుద్రవరం, ఆగస్టు 2: రుద్రవరంలో మురికి కుంట దుర్గంధం అనే శీర్షికతో ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. పంచాయతీ అధికారులు స్పందించారు. డ్రైనేజీల్లోని ప్లాస్టిక్ బాటిళ్లను శ్రువారం తొలగింపజేశారు.

పంటల పరిశీలన


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రుద్రవరం, ఆగస్టు 2: రుద్రవరం సమీపంలో మొక్కజొన్నతో పాటు ఇతర పంటలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రుద్రవరంలో ప్రాంతీయ కృషి విజ్ఞాన కేంద్రం ప్రారంభించినట్లు శాస్త్రవేత్తలు సుధాకర్, ఆదినారాయణ తెలిపారు. రుద్రవరంలో ప్రాంతీయ కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో శుక్రవారం ప్రారంభించామన్నారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నేరుగా విత్తే వరి సాగుపై అవగాహన కల్పించారు. ఈ విధానం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. వరిసాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఉద్యానపంటలైన మిరప, పసుపు, మామిడి పంటల్లో పురుగు, తెగుళ్ల యాజమాన్యంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, శాస్త్రవేత్తలు రవిగౌడ్, ఏఈవో రాజు, రైతులు పాల్గొన్నారు.

ఈద్గా విస్తరణకు ఐదు సెంట్ల స్థలం

శిరివెళ్ల, ఆగస్టు 2: మండలంలోని బోయలకుంట్ల గ్రామంలో ముస్లింలు ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించుకునేందుకు అవసరమైన ఐదు సెంట్ల స్థలాన్ని కాటంరెడ్డి సోదరులు వితరణగా అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామంలో ముస్లింలు అధికంగా ఉండడంతో రంజాన్, బక్రీద్ పర్వదినాల్లో సామూహికంగా ప్రార్థనలు నిర్వహించుకునేందుకు ఈద్గా ప్రాంగణం సరిపోకపోవడంతో ఎన్నికల ముందు విషయాన్ని మాజీ ఎంపీపీ, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఇచ్చిన హామీలో భాగంగా ఎన్నికల అనంతరం ముస్లింల ప్రయోజనార్థం ఈద్గా పక్కనే ఉన్న రూ.2 లక్షలు విలువ చేసే ఐదు సెంట్ల స్థలాన్ని దివంగత సీనియర్ నాయకుడు కాటంరెడ్డి రామలింగారెడ్డి జ్ఞాపకార్థం కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఆయన సోదరులు శుక్రవారం వితరణగా అందజేశారు. ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నాయకుడు శ్రీకాంత్‌రెడ్డిని శాలువా, పూలమాలలతో వారు ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ షబ్బీర్, రవూఫ్, షాకీర్, మాలి, జాఫర్, ఖాదర్ బాషా, ఫరూక్, సద్దాం పాల్గొన్నారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

రుద్రవరం, ఆగస్టు 2: ప్రభుత్వం స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల షెడ్యూలు విడుదల చేసినట్లు ఇన్‌చార్జి ఎంఈవో కోటయ్య శుక్రవారం తెలిపారు. ఈ నెల 1న స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నికల కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. నోటీసు బోర్డులో ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ల జాబితా ప్రదర్శించాలన్నారు.

చంద్రబాబుతోనే సీమకు న్యాయం

కోవెలకుంట్ల, ఆగస్టు 2: రాయలసీమ ప్రాంతానికి న్యాయం చేయడం టీడీపీ అధినేత సీఎం చంద్రబాబుకే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామక్రిష్టారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి గురువారం వచ్చిన చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఐకానిక్ బ్రిడ్జితోపాటు రిజర్వాయర్ నిర్మిస్తానని చెప్పడం సంతోషకరమని అన్నారు.

కన్యకా పరమేశ్వరికి పూజలు

రుద్రవరం, ఆగస్టు 2: రుద్రవరంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి అమ్మవారికి నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. ఆర్యవైశ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు, చీరలు సమర్పించారు.